క్లుప్తంగా

ఉత్సాహంగా సంక్రాంతి క్రికెట్ పోటీలు



జెడ్పీ హైస్కూల్ మైదానంలో ఉత్సాహంగా క్రికెట్ ఆడుతున్న ఆటగాళ్లు

రోలుగుంట: సంక్రాంతి సందర్భంగా ఈ నెల 11 న ప్రారంభమైన క్రికెట్ పోటీలు సోమవారం కూడా కొనసాగాయి. సోమవారం నాడు నిర్వహించిన ఈ పోటీల్లో శ్రీగౌరీ వారియర్స్‌తో వినాయక స్టార్స్ తలపడి విజయం సాధించింది. రామసేనతో శ్రీ గౌరీవారియర్స్ తలపడి విజయం సాధించింది. గల్లీ బాయ్స్‌తో సింబా లెవన్ తలపడి విజయం సాధించింది. ఈ సందర్భంగా నిర్వాహకులు మంగళవారం కూడా ఫైనల్ పోటీలు జరుగుతాయని, వీరిలో విజేతలకు కనుమరోజు బహుమతి ప్రదానం జరుగుతుందని విలేకరులకు వివరించారు.

ఘనంగా కల్యాణ వేంకటేశ్వర స్వామి తిరువీధోత్సవం



తిరువీధోత్సవంతో పాల్గొన్న భక్తులు

మాడుగుల రూరల్ : మండలంలో కె.జె.పురం జంక్షన్‌లో గల కల్యాణ వేంకటేశ్వరస్వామిని సోమవారం భోగి పండగ సందర్భంగా గ్రామంలో తిరువీధోత్సవం నిర్వహించారు. అనంతరం స్వామివారికి కళావేదిక ప్రతిష్ఠింపజేశారు. ఉదయం నుంచి అభిషేకాలు, ప్రత్యేక పూజలను నిర్వహించారు. నెల రోజుల పాటు భక్తుల గోత్ర నామాలతో అభిషేకాలు, ప్రసాద వితరణ జరిపారు. రాత్రికి గోదాదేవి, రంగనాథస్వామి కల్యాణాన్ని అంగరంగ వైభవంగా పూర్తి చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు రాపేటి రామకొండలరావు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

తారువలో జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు రేపు

దేవరాపల్లి : మండలంలోని తారువలో మర్లమాంబ తీర్థ మహోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం జిల్లా స్థాయి కబడ్డీ పోటీలను నిర్వహిస్తున్నట్టు స్థానిక యూత్ సభ్యులు తెలిపారు. ఈ పోటీలలో విజేతలకు రూ.15వేలు, రూ.10 వేలు, రూ.7వేలు, రూ.4వేలు చొప్పున నగదు బహుమతులను అందజేయనున్నట్టు వారు తెలిపారు. బుధవారం ఉదయం గంటలకు ప్రారంభమయ్యే ఈ పోటీలలో పాల్గొనే వారు మంగళవారం సాయంత్రం 6 గంటల లోపు నామినేషన్ ఫీజు చెల్లించాలని సూచించారు. కాగా అమ్మవారి తీర్థ మహోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం భారీ అన్నసమారాధనను నిర్వహించారు. ఈ సందర్భంగా మర్లమాంబ అమ్మవారికి బుధవారం తెల్లవార జాము నుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలు, సాయంత్రం మహిళ కోలాటం, రాత్రి పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

హోమియో వైద్యాధికారిగా మౌనికా లోకేష్



ఆరోగ్య పరీక్షలను చేస్తున్న వైద్యాధికారి మౌనికా లోకేష్

మాడుగుల రూరల్ : మండలంలో ఎం.కోడూరు హోమియోపతి వైద్యాధికారిగా మౌనికా లోకేష్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆస్పత్రిలో సోమవారం ఆయన బాధ్యతలను స్వీకరించారు. హోమియో వైద్యం అందరికీ అందేలా విధులను నిర్వహించనున్నట్టు ఆయన తెలిపారు. వైద్యాధికారిగా బాధ్యతలు చేపట్టిన మౌనికా లోకేష్‌ను సర్పంచ్ గొల్లవిల్లి సంజీవరావు, అప్పలనాయుడు, పోతిన జగదీష్, గెంజి రాజేష్‌కుమార్, ఎంపీటీసీ రమణబాబు అభినందించారు.

21న మండల సమావేశం

మాడుగుల : మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 21 వ తేదీన జరగనుందని, ఎంపీడీవో కొంకి అప్పారావు అన్నారు. ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్ ఆధ్వర్యంలో మండల పరిషత్ సమావేశ మందిరంలో ఉదయం 10 గంటలుకు జరగనుందన్నారు. మండల స్థాయి అధికారులు మూడు నెలలుగా జరిగిన అభివృద్ధి సంక్షేమం పై నివేదికతో సమావేశానికి హాజరు కావాలన్నారు. ఈ సమావేశానికి ఎంపీటీసీలు సర్పంచ్‌లు విధిగా హాజరు కావాలని కోరారు.



ఇంటింటా భోగిభాగ్యాలు

- ఆనందాల కోలాటాలు • రంగవల్లులు • బసవన్నల సందళ్లు



రోలుగుంటలో భోగి వేడుక



శెట్టిపాలెంలో ఆకట్టుకున్న సోషల్ మీడియా ముగ్గు



చిడతల కోలాటం ఆడుతున్న వాకర్స్‌క్లబ్ కుటుంబ సభ్యులు



తారువ రామాలయం వద్ద యూత్ సభ్యులతో మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు



కుటుంబ సభ్యులతో కలిసి భోగి వేడుకలను జరుపుకొంటున్న మాజీ ఎమ్మెల్యే గణేష్



మాకవరపాలెం రామాలయంలో భోగిపళ్లు వేస్తున్న దృశ్యం



కె.జె.పురంలో భోగి వేడుకల్లో కరణం ధర్మశ్రీ

నర్సీపట్నం : నియోజకవర్గంలో భోగి పండగను ప్రజలు ఘనంగా జరుపుకొన్నారు. ఇళ్ల ముగింట రంగవల్లులు, డూడూ బసవన్నల హడావుడితో కళకళలాడాయి. మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ కుటుంబ సభ్యులతో భోగి పండుగను ఘనంగా జరుపుకొన్నారు. సంక్రాంతి పండగ ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాలన్నారు. నియోజకవర్గ ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. పట్టణంలో ఎన్టీఆర్ మినీ స్టేడియంలో వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో భోగి పండగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్పీకర్ సిహెచ్. చింతకాయల అయ్యన్నపాత్రుడు ముఖ్య అతిథిగా విచ్చేసారు. స్పీకర్‌తో పాటు క్లబ్ కుటుంబ సభ్యులు సంప్రదాయ దుస్తులు ధరించి భోగి వేడుకలకు హాజరయ్యారు. క్లబ్ సభ్యులతో కలిసి ఆయన భోగి మంట వేశారు. గతంలో సంక్రాంతికి జానపద కళాకారులు ఇంటింటికి వచ్చేవారు.. సంకీర్తనలు ఉండేవన్నారు. ఈ సంప్రదాయాలు రాను రాను కనుమరుగవుతున్నాయన్నారు. స్వామి అయ్యప్ప స్వామి దేవాలయం ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించే మకరజ్యోతి ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. భోగి మంట చుట్టూ ప్రదర్శనలు చేసి మహిళలు అడుగులో అడుగు వేస్తూ చిడతల కోలాటం ఆడారు.

రోలుగుంట : మండలంలో గల గ్రామాల్లో సోమవారం భోగి పండగను ఆయా గ్రామాల ప్రజలు ఘనంగా నిర్వహించుకున్నారు. దీనిలో భాగంగా సోమవారం వేకువ జామున పండగ సంప్రదాయాలను పాటిస్తూ వేకువజామునే లేచి భోగి మంటలు వేసుకున్నారు. ఆ మంటల వద్ద కుటుంబీకులు పాడుపు కథలు, తదితర కబుర్లతో ఆనందంగా గడిపారు. ముందుగా పేడతో తయారు చేసి ఉంచుకున్న పిడకలను మంటల్లో వేశారు.

కె.కోటపాడు : మండల వాసులు భోగి పండగను గ్రామ గ్రామాన సోమవారం ఘనంగా నిర్వహించుకున్నారు. గ్రామాల్లో గల యువకులు, ప్రజలు వేకువజామునే లేచి గ్రామాల్లో భోగి మంటలను వేసుకుని ఆనందోత్సాహాల నడుమ పండగ చేసుకున్నారు. చిన్నపిల్లలకు భోగి పళ్లను వేసే కార్యక్రమాన్ని జరిపారు.

దేవరాపల్లి: మండల వ్యాప్తంగా ప్రజలు భోగి పండుగను సోమవారం ఘనంగా జరుపుకొన్నారు. భోగ భాగ్యాలు ప్రసాదించే భోగి పండగను పురస్కరించుకొని తెల్లవార జాము నుండి సున్ని పిండితో స్నానమాచరించి ప్రతి ఇంటా భోగి మంటలతో సందడి చేశారు. సంప్రదాయ దుస్తులు ధరించి భోగి మంటల్లో పాత వస్తువులను వేసి ప్రత్యేక పూజలు జరిపారు. తారువలో రామాలయం వద్ద బూడి యూత్ ఆధ్వర్యంలో జరిగిన భోగి వేడుకల్లో మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు పాల్గొన్నారు.

మాడుగుల : మండలంలో భోగి పండగ సోమవారం అలనాటి సంప్రదాయం ప్రకారం నిర్వహించారు. కుటుంబ సమేతంగా భోగి మంటల వద్ద ఆనందంగా గడిపారు. ఇంటిముంగిటకు వచ్చిన జంగమయ్య చదివింపులతో పాటు డూడూ బసవన్నలు సందడితో గ్రామాల్లో సందడి నెలకొంది.

మాకవరపాలెం : మండలంలో నారాయణరాజుపేట, లచ్చన్నపాలెం, మాకవరపాలెంతోపాటు పలు గ్రామాల్లో రామాలయ కమిటీ ఆధ్వర్యంలో మేలుకొలుపు కార్యక్రమాన్ని నిర్వహించిన అనంతరం సంక్రాంతి ఉత్సవాలను ప్రారంభించారు. భజనలు, కోలాటాలతో ప్రజలంతా ఒకేచోటకు చేరి సంక్రాంతి వేడుకల్లో పాల్గొన్నారు. శెట్టిపాలెంలో ముగ్గులు పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో డోంట్ బి ఎడిటెడ్ అంటూ సోషల్ మీడియా అయిన ఫేస్‌బుక్, వాట్సాప్, ఇన్‌స్టాగామ్, యూట్యూబ్ ఐకాన్లతో వేసిన ముగ్గు ఆకట్టుకోవడంతోపాటు ప్రథమ స్థానంలో నిలిచింది. విజేతలకు సర్పంచ్ అల్లు రామునాయుడు బహుమతులు అందజేశారు. మాకవరపాలెం రామాలయంలో పిల్లలకు పెద్దలు భోగి పళ్లు వేసి దీవించారు.

కె.జె.పురంలో భోగి వేడుకల్లో కరణం ధర్మశ్రీ

మాడుగుల రూరల్ : భోగి పండగను మండల గ్రామాల్లో సోమవారం ఘనంగా ప్రజలు జరుపుకొన్నారు. తెల్లవారుజామున భోగి మంటలను వేసుకొని ఆనందోత్సాహాలతో పండగ జరిపారు. మాజీ ప్రభుత్వ విప్, చోడవరం మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ కె.జె.పురంలో భోగి వేడుకల్లో పాల్గొన్నారు.

వైభవంగా గోదాదేవి కల్యాణం

- మండలంలో 28 గ్రామాల్లో మేలుకొలుపులు
- భక్తి కీర్తనలో వాహనంపై గోదాదేవిని ఊరేగించిన భక్తులు



రోలుగుంటలో రథంపై గోదాదేవిని ఊరేగిస్తున్న భక్తులు



మేడిచర్లలో గోదాదేవి, రంగనాథస్వామికి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



మాడుగుల పార్థసారథి ఆలయంలో గోదాదేవి కల్యాణం

రోలుగుంట: గత నెలలో ప్రారంభమైన ధనుర్మాసోత్సవాలు సోమవారం భోగి రోజుతో ఘనంగా ముగిసాయి. ఈ కార్యక్రమంలో భాగంగా ఉత్సవ మూర్తుల (గోదాదేవి, విష్ణుమూర్తి) చిత్రపటాలను వాహనంపై మండలంలో గల 28 రోజుల పాటు ఊరేగించారు. రోలుగుంటకు చెందిన సిద్ది వినాయక జీవకారుణ్య సంఘం సభ్యులు సంయుక్తంగా నిర్వహించారు. కార్యక్రమ ఆచారాలను పాటిస్తూ ప్రతి రోజూ వేకువజామున గ్రామ వీధుల్లో ఉత్సవ మూర్తులను ఊరేగిస్తూ విష్ణుమూర్తికి ఇష్టమైన భక్తి కీర్తనలు విలపిస్తూ గ్రామాల్లో ఆధ్యాత్మికతను నింపారు. ముగింపు రోజు సోమవారం గోదాదేవి రంగనాథుని కళ్యాణం ఘనంగా నిర్వహించారు.

కె.కోటపాడు : మేడిచర్ల గ్రామంలో గల భూ గోదాదేవి సమేత కేశవ స్వామి ఆలయంలో గోదాదేవి, రంగనాథస్వామి కల్యాణం సోమవారం కనుల పండువగా నిర్వహించారు. భోగి పండగను పురస్కరించుకొని ప్రతి ఏటా గోదాదేవి, రంగనాథస్వామి కల్యాణం నిర్వహిస్తున్నట్టు ఆలయ అర్చకులు తాత వెంకట రమణమూర్తి తెలిపారు.

మాడుగుల : ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా స్థానిక పురాతన పార్థసారథి స్వామి ఆలయంలో సోమవారం గోదాదేవి కల్యాణం నేత్రపర్వంగా జరిగింది. మాడుగులతో పాటు చుటుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో అధిక సంఖ్యలో భక్తులు వచ్చి కల్యాణం తిలకించారు. ఈ సందర్భంగా స్వామివారిని, గోదాదేవిని పుష్పాలు, నగలతో ప్రత్యేకంగా అలంకరించారు.

నేడు నారమ్మ పేరంటాలు తీర్థం

కె.కోటపాడు : చౌడువాడ గ్రామంలో సంక్రాంతి పండగను పురస్కరించుకొని మంగళవారం నారమ్మ పేరంటాలు తీర్థం జరపనున్నట్టు తీర్థ నిర్వాహక కమిటీ సభ్యులు తెలిపారు. నారమ్మ పేరంటాలు గుండం వద్ద భక్తులను పూజలను చేసేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మధ్యాహ్నం జిల్లా స్థాయి ఎడ్ల పరుగు పందాల ప్రదర్శనను నిర్వహించనున్నట్టు తెలిపారు. విజేతలకు నగదు పురస్కారాన్ని బహుమతిగా అందించనున్నట్టు కమిటీ సభ్యులు తెలిపారు.

నిరుపేదలకు నిత్యావసర సరుకుల అందజేత



ఎ.భీమవరంలో నిత్యావసర సరుకులను అందిస్తున్న రామ్మూర్తి, శేషు

కె.కోటపాడు : ఎ.భీమవరం గ్రామంలో 50 మంది నిరుపేదలకు సంక్రాంతి పండగ పర్వదినం నేపథ్యంలో గ్రామానికి చెందిన గుడిపాటి రామ్మూర్తి తన సొంత నగదుతో ఆరు రకాలైన నిత్యావసర సరుకులను అందించారు. గ్రామ సర్పంచ్ తర్రా సన్యాసమ్మ సమక్షంలో పేదలకు సోమవారం బియ్యం, కందిపప్పు, మినప పప్పు, చక్కెర తదితర వస్తువులను రామ్మూర్తి పంపిణీ చేశారు. పండగ సమయాల్లో పేద కుటుంబాల్లో నిత్యావసర సరుకుల లేమి ఉండకూడదన్న కారణంగా రూ.25వేల సొంత నగదుతో కొనుగోలు చేసి అందించినట్టు తెలిపారు. కార్యక్రమంలో తర్రా శేషు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఆటల పోటీలు



కబడ్డీ ఆడుతున్న ఆటగాళ్లు

నాతవరం: నియోజకవర్గ స్థాయిలో సంక్రాంతి పండగ సందర్భంగా కేఎస్ఆర్ గ్రూపు సభ్యులు ఏర్పాటు చేసిన ఆటలు పోటీలు ఉత్సాహంగా జరుగుతున్నాయి. ప్రతి ఏటా సంక్రాంతి పండగకు నాతవరం గ్రామంలో కేఎస్ఆర్ గ్రూపు ఆధ్వర్యంలో ఆటలు పోటీలు ఏర్పాటు చేస్తున్నారు. ఈ ఏడాది కూడా క్రికెట్, వాలీబాల్, కబడ్డీ పోటీలు ఏర్పాటు చేశారు. పోటీలను ఎస్ఐ భీమరాజు స్థానిక ప్రజా ప్రతినిధులు ప్రారంభించారు.

వైభవంగా రుద్రహోమం

మాకవరపాలెం: వామలింగేశ్వరస్వామి ఆలయంలో రుద్ర హోమం వైభవంగా నిర్వహించారు. మంగళవారం ఆరుద్ర నక్షత్రం సందర్భంగా ఈ ఆలయంలో ఉన్న స్వయం భూ లింగానికి అర్చకులు అన్నంతో అభిషేకం చేశారు. అనంతరం రుద్ర హోమం, లక్ష్మీగణపతి హోమం, మృత్యుంజయ హోమంతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలదే ఎస్సీ వర్గీకరణ కుట్ర



దళిత సంఘాల నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న కాటపల్లి అప్పారావు

దేవరాపల్లి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కుట్రతోనే ఎస్సీ విభజించే ప్రయత్నం చేస్తున్నారని ఎస్సీఎస్టీ విజిలెన్స్ అండ్ మోనటరింగ్ కమిటీ సభ్యులు కాటపల్లి అప్పారావు ఆరోపించారు. ఈ మేరకు దేవరాపల్లిలోని శ్రీ సన్యాసమ్మ అమ్మవారి ఆలయ ఆవరణలో దళిత సంఘాల ఐక్యవేదిక నాయకుల సమావేశం జరిగింది. ఇటీవల పార్లమెంట్ సమావేశంలో రాజ్యాంగ హక్కు ద్వారా పదవి పొందిన అమిత్ షా అంబేద్కర్‌పై చేసిన వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. అంబేద్కర్ ఆలోచన విధానమే ఈ దేశానికి శరణ్యమని, వర్గీకరణను అడ్డుకునేందుకు కలిసికట్టుగా పనిచేస్తామన్నారు. మండలంలోని దళిత ఐక్య సంఘాలన్నీ కలిసి మండల అంబేద్కర్ ఆశయ సాధన సమితిని ఏర్పాటు చేయనున్నట్లు ఆయన స్పష్టం చేశారు. ఎస్సీ,ఎస్టీ చట్టాలను పటిష్ట పరిచి, దళితులకు రావాల్సిన సబ్ ప్లాన్ నిధులను రాబట్టి, దళితుల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఈ సమావేశంలో మండల నాయకులు కార్లి సాయి సుందరరావు, మచ్చ వీర్రాజు, తాడి అప్పారావు, మచ్చ రామారావు, సబ్బవరపు మాలిబాబు, ఉల్లి దేముళ్లు, కంచిమాల అప్పారావు, ఉల్లి శ్రీను, కె. అప్పారావు పాల్గొన్నారు.

వైభవంగా స్వయంభూ విఘ్నేశ్వరుని తీర్థం



స్వయంభూ విఘ్నేశ్వరునికి పూజలను చేస్తున్న వైస్ ఎంపీపీ సూర్యనారాయణ, తదితరులు

కె.కోటపాడు : మల్లంపాలెం స్వయంభూ విఘ్నేశ్వరుని తీర్థ మహోత్సవాన్ని సోమవారం వైభవంగా జరిపారు. ప్రతీ ఏటా స్వయంభూ విఘ్నేశ్వరుని తీర్థం భోగి పండగనాడు జరపడం ఆనవాయితీ. ఈ సందర్భంగా స్వయంభూ విఘ్నేశ్వరుని ఆలయంలో గ్రామస్తులతో పాటు పరిసర గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజా కార్యక్రమాలను జరిపారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో అన్న సమారాధన జరిపారు. తీర్థం సందర్భంగా స్వయంభూ విఘ్నేశ్వరుడిని వైస్ ఎంపీపీ రొంగలి సూర్యనారాయణ, వార్డు సభ్యులు వంటాకు గోవిందరావు, వంటాకు రామునాయుడు, మాజీ ఉప సర్పంచ్ బొడ్డు లక్ష్మి దేముడుబాబు, జాగరపు కన్నంనాయుడు, పెదగాడి సత్యనారాయణ, బొడ్డు అప్పారావు, తోటపు చిరంజీవి దర్శించుకొని ప్రత్యేక పూజలు జరిపారు.

భోగి మంటల్లో విద్యుత్ బిల్లులు

సీపీఎం ఆధ్వర్యంలో వినూత్న నిరసన



ఆనందపురంలో విద్యుత్ బిల్లులను మంటల్లో వేసి నిరసన తెలుపుతున్న ముత్యాలనాయుడు

కె.కోటపాడు : ఎన్నికల ముందు విద్యుత్ బిల్లులను పెంచబోమని ప్రజలకు హామీని ఇచ్చిన చంద్రబాబు అధికారంలోనికి వచ్చిన తరువాత విద్యుత్ చార్జీలను పెంచుతూ నిర్ణయం తీసుకోవడం అన్యాయమని సీపీఎం మండల కార్యదర్శి రొంగలి ముత్యాలనాయుడు అన్నారు. సీపీఎం పిలుపు మేరకు సోమవారం ఆనందపురంలో స్థానికులతో కలిసి భోగి మంటల్లో విద్యుత్ బిల్లులను వేసి నిరసన తెలిపారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ చంద్రబాబు ట్రూఅప్ చార్జీల పేరిట రూ.18వేల కోట్లు విద్యుత్ వినియోగదారులపై భారం వేశారని తెలిపారు. ఛార్జీల పెంపు నిర్ణయాన్ని తక్షణం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. సూర్రెడ్డిపాలెంలో జరిగిన కార్యక్రమంలో సీపీఎం నాయకుడు నాయుడుబాబు, గొండుపాలెంలో సీపీఎం నాయకుడు యర్రా దేముడు నిరసనలో పాల్గొన్నారు.

కేజేపురంలో వైభవంగా గోదాదేవి కల్యాణం



కేజేపురంలోగోదాదేవి కళ్యాణంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే ధర్మశ్రీ తదితరులు

మాడుగుల రూరల్ : మండలంలో కేజే పురం కళావేదిక మీద గోదా రంగనాధులు కళ్యాణం సోమవారం రాత్రి అంగరంగ వైభవంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన పుట్టా రాంబాబు, చంద్ర దంపతులు పాల్గొని గోదాదేవి కళ్యాణం చేపట్టారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ , సీడీసీ చైర్మన్ సుంకర శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యులు బి.శ్రీనివాసరావు, ఆలయ కమిటీ చైర్మన్ రాపేటి రామకొండలరావు శ్రీవారి సేవలో పాల్గొన్నారు.

ఉత్సాహంగా ముగ్గుల పోటీలు



పీపీ అగ్రహారంలో విజేతలకు బహుమతులు అందిస్తున్న నాయకులు



ఎల్‌బీ పురంలో విజేతలకు బహుమతుల ప్రదానం



ముగ్గుల పోటీలు తిలకిస్తున్న గ్రామ పెద్దలు

బుచ్చెయ్యపేట మండలంలో గల ఎల్‌బీపురం, పీపీ అగ్రహారం గ్రామాల్లో సోమవారం సంక్రాంతి ముగ్గుల పోటీలు జరిగాయి. పోటీలో పలువురు ఉత్సాహంగా పాల్గొని ముగ్గులు వేశారు. వయస్సుతో సంబంధం లేకుండా చిన్న పెద్దలు ముగ్గుల పోటీలో పాల్గొని తమ నైపుణ్యం ప్రదర్శించి అందమైన ముగ్గులు వేసి బహుమతులు పొందారు. రెండు గ్రామాల్లో విజేతలకు గ్రామ పెద్దలు, నాయకులు,కమిటీ సభ్యుల చేతుల మీదుగా బహుమతులు అందించారు.

నాతవరం : పండగ సందర్భంగా మహిళలు వేసే ముగ్గుల పోటీలు నూతన ఉత్తేజం తెస్తుందని రాష్ట్ర బీసీ కార్పొరేషన్ డైరెక్టరు రాజాన సూర్య చంద్ర అన్నారు. వల్సంపేట గ్రామంలో భోగి పండగ సందర్భంగా ఏర్పాటు చేసిన ముగ్గుల పోటీలను సోమవారం తిలకించారు. ముగ్గులను న్యాయనిర్ణేయతలు పరిశీలించి ప్రోత్సాహాలకు పలువురిని ఎంపిక చేశారు. కార్యక్రమంలో పెద్దలు కృష్ణారావు, ప్రగడ కృష్ణ పాల్గొన్నారు.

పెదమదీనలో అన్న సమారాధన



అన్న సమారాధనలో పాల్గొన్న భక్తులు

బుచ్చెయ్యపేట : పెద మదీన గ్రామంలో భారీ అన్నసమారాధన నిర్వహించారు. నెల రోజులుగా గ్రామానికి చెందిన మేలుకొలుపు బృంద సభ్యులు రామాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. మేలు కొలుపు బృంద సభ్యులు పలువురు నుంచి కానుకలు స్వీకరించారు. గ్రామస్తులు అందించిన బియ్యం సోమవారం రామాలయం వద్ద ఉంచి అన్నసమారాధనకు వినియోగించారు. దేవునికి నైవేదాలు వడ్డించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామస్తులంతా సమష్టిగా అన్న సమారాధనలో పాల్గొన్నారు. మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అచ్చింనాయుడు,గ్రామ నాయకులు జోగా కొండబాబు, అప్పారావు పాల్గొన్నారు.

ఘనంగా ముగిసిన మేలుకొలుపులు



మునగపాకలో పరమేశ్వరుని చిత్రపటాన్ని ఊరేగిస్తున్న భక్తులు

కోటవురట్ల/మునగపాక: గత నెల 17న ధనుర్మాసంలో ప్రారంభమైన మేలుకొలుపుల కార్యక్రమం భోగి పండుగతో ముగిసింది. ఇందులో భాగంగా కోటవురట్ల మండలం పాములవాకలో మాజీ సర్పంచ్ కిల్లాడ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గణపతి, సీతారామలక్ష్మణ ఆంజనేయ స్వామి, షిర్డీ సాయిబాబా ఉత్సవ విగ్రహాలతో నగర సంకీర్తన చేశారు. పెద్ద సంఖ్యలో హాజరైన భక్తులు కోలాటం ఆడుతూ ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా చిడతల డ్యాన్సు, డప్పు వాయిద్యాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. మునగపాక పల్లపు వీధి వినాయక కమిటీ ఆధ్వర్యంలో పరమేశ్వరుని చిత్రపటాన్ని డప్పువాయిద్యాల నడుమ ఊరేగించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అన్న సమారాధనకు భక్తులు భారీగా తరలివచ్చారు. వాడ్రాపల్లి, గవర్ల అనకాపల్లి, చూచుకొండ, గణపర్తి తదితర గ్రామాల్లో భక్తులు మేలుకొలుపుల కార్యక్రమంలో పాల్గొన్నారు.